వికారాబాద్ డీఎస్పీ అంజయ్య బదిలీ

## నూతన డీఎస్పీగా శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 3 : వికారాబాద్ డీఎస్పీగా పనిచేసిన అంజయ్య ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్.శ్రీనివాస్‌రెడ్డిని వికారాబాద్ డీఎస్పీగా నియమించారు. వికారాబాద్ డీఎస్పీగా పని చేసిన అంజయ్యను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. గత కొన్ని రోజుల క్రితమే డీఎస్పీ అంజయ్య వికారాబాద్‌కు బదిలీపై వచ్చారు.

ప్రధాని మోదీ రాక సందర్భంగా

## నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా సోమవారం బేగంపేట్ నుంచి సోమాజిగూడ వరకు అరగంట పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి 7.40 నుంచి 8.10 నిమిషాల మధ్య బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి షాపర్ స్టాప్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట్ ఫ్లైఓవర్, గ్రీన్ ల్యాండ్స్, రాజీవ్‌గాంధీ విగ్రహం, మొనప్ప ఐలాండ్ జంక్షన్, యశోద ఆసుపత్రి, ఎంఎంటీఎస్, రాజ్‌భవన్ వరకు ఈ ఆంక్షలు ఉంటాయన్నారు. అలాగే 5వ తేదీ ఉదయం 9.50 నుంచి 10.15 నిమిషాల మధ్య రాజ్‌భవన్ నుంచి బేగంపేట్ ఎయిర్‌పోర్టు వరకు ఆంక్షలు విధిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎల్బీస్టేడియంలో నేడు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి ప్రభుత్వం నియామకపు పత్రాలు అందజేయనున్న నేపథ్యంలో స్టేడియం పరిసరాల్లో సోమవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ నగర ట్రాఫిక్ పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారు.

# శంభో.. శివశివ శంభో..

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- శివనామస్మరణతో మార్మోగనున్న ఉత్తర రామలింగశ్వరస్వామి ఆలయం
- రామేశ్వరంలో భక్తులకు అన్ని రకాల మౌలిక వసతులు


ఉత్తర రామలింగేశ్వరస్వామి ఆలయం

షాద్‌నగర్‌రూరల్, మార్చి 3 : ద్వాపర యుగం నాటి రామేశ్వరంలో ఉన్న ఉత్తర రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి విచ్చేస్తుంటారు. ప్రతి సోమవారం, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఇక్కడ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారు.

### ఆలయానికి దారి

షాద్‌నగర్ నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉత్తర రామలింగేశ్వరస్వామి ఆలయం ఉన్నది. జాతీయ రహదారిపై ఆలయ ముఖద్వారం కలదు . షాద్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ముఖద్వారం నుంచి ప్రైవేటు ఆటోలు ఉంటాయి.

### ఉత్సవాల వివరాలు

బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 4న గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుద్రహోమం, అంకురార్పణం, ధ్వజారోహణం, 5న శివపార్వతుల కల్యాణం, 6న నందిసేవ, అగ్నిగుండాలు, 7న రుద్రాభిషేకం, 8న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, 9న రుద్రహోమం, పూర్ణాహుతి, 10న రథోత్సవం, 11న శివతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ వ్యవస్థాపకుడు, ధర్మకర్త రవీందర్‌రావు, వంశపారంపర్య అర్చకుడు ప్రహ్లాదాచార్యులు కోరారు.


కోనేరులోని శివయ్య


ఉత్తర రామలింగేశ్వరస్వామి


ఆలయం ఎదురుగా నందీశ్వరుడు

### ఏర్పాట్లు పూర్తి

ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. సుమారు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకోనుండడంతో అన్ని మౌలిక వసతులను సమకూర్చనున్నట్లు తెలిపారు.

### వసతులు

బ్రహ్మోత్సవాలకు భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని అన్ని మౌలిన వసతులను సమకూర్చనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### దర్శనాలు

భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని కేవలం స్వామివారి స్పర్శ దర్శనం మాత్రమే ఉంటుంది. స్పర్శ దర్శనానికి రూ.100, శీఘ్ర దర్శనానికి రూ.50, వీఐపీ దర్శనాలకు రూ.200 వసూలు చేయనున్నారు.

మంచినీటి వసతి, వైద్య సదుపాయం, బారికేడ్లు, సేద తీరేందుకు చలువ పందిర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా కుండీలను ఏర్పాటు చేశారు. మంచినీటి ట్యాంకులను అందుబాటులో ఉంచనున్నారు. క్యూలో ఉండే భక్తులకు మంచినీటిని అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కోనేటిలో నీటిని శుద్ధి చేసినట్లు వివరించారు. ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లామన్నారు.

### విశాలమైన ప్రదేశంలో పార్కింగ్

అలయ పరిసర ప్రాంతంలో సువిశాలమైన ప్రదేశాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్ వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు. అలయ సమీపంలో తాత్కాలికంగా ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

### మౌలిక వసతులు సమకూర్చనున్నాం



అలయానికి వచ్చే భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని అన్ని మౌలిక వసతులు సమకూర్చనున్నాం. భక్తులు సేద తీరడానికి టెంట్లను ఏర్పాటు చేశాం. ఆలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థలు తోడ్పాటునందించాలి. వలంటీర్లను నియమిస్తాం. ఆలయ పరిసర ప్రాంతాల్లో సుమారు 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పహారా కాయనున్నారు. అందరికీ అర్థమయ్యేలా క్యూలైన్లలో సమాచార బోర్డులను ఏర్పాటు చేస్తాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నా వెంటనే సమాచారం ఇవ్వాలి. భక్తులు సమన్వయాన్ని పాటించి పోలీసులు, సిబ్బందికి సహకరించాలి.

**- శివకుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి, రామేశ్వరం**

### అందరూ సహకరించాలి



ఆలయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందుకే స్పర్శ దర్శనం మాత్రమే ఉంటుంది. భక్తుల సమన్వయంతో ఉండాలి. అందరూ సహకరించాలి. అనివార్య సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారమందించాలి.

**- వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు**

## బీహెచ్ఈఎల్ లో భూసార పరీక్షలు

- క్షేత్రస్థాయిలో మెట్రో రెండో దశ పనులు
- మరో రెండు నెలల్లో డీపీఆర్ రూపకల్పన

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రెండో దశ మెట్రో పనులు క్షేత్రస్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఆధ్వర్యంలో రెండు ప్రైవేటు కన్సల్టెన్సీలు 70 కి.మీ మేర ప్రతిపాదించిన మార్గాల్లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు అవసరమైన పనులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 7 మార్గాలను ప్రాథమికంగా ఖరారు చేయడంతో, ఆయా మార్గాల్లో ట్రాఫిక్ సర్వేతో పాటు భూ సార పరీక్షలను ఏక కాలంలో చేపట్టారు. రెండు మూడు రోజులుగా మియాపూర్ నుంచి పటాన్‌చెరువు వరకు నిర్ణయించిన మార్గంలో రోడ్డు మధ్య డ్రిల్లింగ్ యంత్రాలతో నేల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు. హైదరాబాద్-ముంబై జాతీయ రహదారిపై ఉన్న చందానగర్, బీహెచ్ఈఎల్ ప్రాంతాల్లో పలు చోట్ల రోడ్డు మధ్యలో నేల స్వభావాన్ని తెలుసుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మొదటి దశలో మియాపూర్ వరకు మెట్రో కనెక్టివిటీ ఉండటంతో దానికి అనుసంధానంగా బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్‌చెరూ వరకు సుమారు 8 కి.మీ మేర రెండో దశలో మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఈ మార్గంలో రోడ్డు విశాలంగా ఉండడంతో భూసేకరణ అవసరం లేకుండా మెట్రో వయాడక్ట్‌ను రోడ్డు మధ్యలోంచే నిర్మించేందుకు అనుకూలంగా ఉన్నదని మెట్రో ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఇదే తరహాలో మిగిలిన ప్రతిపాదిత కారిడార్లలో డీపీఆర్ రూపొందించేందుకు అవసరమైన పనులను క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్నామని, రెండు నెలల్లో డీపీఆర్‌ను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు మెట్రో అధికారులు తెలిపారు.

# పల్స్ పోలియో ప్రారంభం

- వికారాబాద్ జిల్లాలో 87,938 మంది చిన్నారులు
- 93 శాతం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి పల్వన్‌కుమార్

వికారాబాద్, మార్చి 3 : వికారాబాద్ రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 87,938 ఐదు సంవత్సరాల లోపు పిల్లలుండగా.. 545 పోలియో బూత్‌ల ద్వారా 93% శాతం మందికి పల్స్ పోలియో చుక్కలు వేశారు. మరో రెండు రోజుల పాటు ఆరోగ్య సిబ్బంది గృహ సందర్శన చేసి పోలియో చుక్కలు వేసుకోకుండా ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయనున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పక వేయించి వారి బంగారు భవిష్యత్తుకు, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని ఆయన సూచించారు.


సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ విజ్ఞప్తి చేస్తున్న రైతులు

# పేద రైతులను కాపాడండి

సీఎం రేవంత్‌రెడ్డికి అప్పాయిపల్లి సర్వే నం.19లోని రైతుల బహిరంగ విజ్ఞప్తి

కొడంగల్, మార్చి 3 : మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలోని సర్వే నం.19లో పేద రైతులకు 1972లో ప్రభుత్వం అందించిన లావణి పట్టాలను సాగు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని, ఇప్పుడు అభివృద్ధి పనుల పేరుతో భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని.. దయచేసి ఆదుకోవాలని కోరారు. ఆదివారం సర్వే నం.19లోని రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగంగా భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 100 సంవత్సరాలుగా 47 కుటుంబాలు ఈ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నామని, ఇప్పుడు ఒక్కసారిగా భూములను అప్పగించాలంటే తాము ఏ విధంగా బతకాలని వాపోయారు. వైద్య కళాశాల నిర్మాణాన్ని స్వాగతిస్తున్నామని, కానీ సాగు భూముల్లో కాకుండా సాగుకు ఉపయోగంలో లేని భూముల్లో ఏర్పాటు చేస్తే అటు రైతులకు, ఇటు విద్యార్థులకు ఆసరా కల్పించినవారవుతారని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు. సీఎం నివాసంలో సీఎంను కలిసేందుకు వెళ్లామని.. ముందుగా సీఎం సోదరుడిని అక్కడున్న అధికారులు తిరిగి పంపించారని పేర్కొన్నారు. దీంతో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి తమ గోడు విన్నవించుకున్నట్లు తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో ఈ బహిరంగ విజ్ఞప్తి చేస్తున్నామని న్యాయం చేయాలని కోరారు. రైతులపై కేసులు కూడా పెట్టారని తెలిపారు. ఈ విషయమై న్యాయం కోసం మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త వసంతలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎస్ తిరుపతయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ అద్దం రాజు, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సంజీవ్ తదితరులు ఆదివారం గ్రామానికి వచ్చి రైతుల వివరాలతో పాటు వాస్తవాలను గ్రహించినట్లు పేర్కొన్నారు. పేద రైతులకు భరోసా కల్పించేలా ముఖ్యమంత్రి ప్రకటన చేపట్టాలని కోరారు.

# మల్లన్న జాతరకు వేళాయే..

ఐదు రోజులపాటు జరుగనున్న ఉత్సవాలు


ఆలయంలో కొలువైన మల్లన్నస్వామి


ఏక్వాయిపల్లి-ముద్విన్ గ్రామాల సమీపంలోని శివాలయం

కడ్తాల్, మార్చి 3 : మండల పరిధిలోని ఏక్వాయిపల్లి-ముద్విన్ గ్రామాల శివారులోని మల్లన్నగుట్టపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 8 నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎట్టయ్యయాదవ్ తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు ఏక్వాయిపల్లి, ముద్విన్ ప్రజలతోపాటు, ఆమనగల్లు, మాడ్గుల మండలాల ప్రజలు తరలివస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### జాతర వివరాలు

ఈ నెల 8న ఉదయం పంచామృతాలతో మహాశివుడికి అభిషేకం, గణపతి పూజ, రాత్రికి శివపార్వతుల కల్యాణోత్సవం, 9న తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ఆవరణలో అగ్నిగుండాలు, ఒగ్గు కథ, 10న స్వామివారికి ప్రత్యేక పూజలు, రాత్రికి రథోత్సవం, 11న విశేష పూజలు, దోపోత్సవం, ఒగ్గు కథ, 12న ఒగ్గు కథ, చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు వివరించారు.




# కిక్కిరిస్తున్న మెట్రో జర్నీ

## మెట్రో ఎండీ సూచనలు పాటించని ఎల్ అండ్ టీ

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): మెట్రో రైళ్లలో ప్రయాణం కిక్కిరిసిపోతున్నది. రద్దీ గణనీయంగా చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. మెట్రో సేవలు ప్రారంభమైన ఆరేండ్లలో ఒకేరోజు 5.47 లక్షల మంది రాకపోకలు సాగించడం వంటి రికార్డు నమోదైనా.. అధికారులు రద్దీకి తగ్గట్టుగా..అదనపు కోచ్‌లు జత చేయడంపై దృష్టి పెట్టలేదు. ఏకంగా మెట్రో ఎండీ అదనపు కోచ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని అనేక సార్లు సూచించినా.. పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు కిక్కిరిసిన రైళ్లలోనే ప్రయాణం చేయాల్సి వస్తున్నది.

### 2-3 లక్షల మంది ఐటీ ఉద్యోగులు

ముఖ్యంగా కరోనాతో ఐటీ రంగంలో ప్రవేశ పెట్టిన వర్క్ ఫ్రమ్ హోం విధానం మెట్రోపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ తర్వాత క్రమంగా మెట్రో రైళ్లలో రద్దీ పెరుగుతుండడంతో దానికి అనుగుణంగా అదనపు కోచ్‌లను జతచేయాల్సి ఉన్నా.. ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఐటీ ఉద్యోగులు 10లక్షలకు పైగానే నగరంలో నివాసం ఉంటున్నారు. అధిక శాతం నగరానికి పడమర దిక్కునే 95 శాతం ఐటీ కారిడార్ విస్తరించి ఉంది. దీంతో చాలా మంది ఈ ప్రాంతానికి అనుసంధానమై ఉన్న ప్రజా రవాణా సాధనమైన మెట్రోలోనే నిత్యం 2-3 లక్షల మంది ఐటీ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. కొవిడ్ మూలంగా ఐటీ కంపెనీల్లో వర్క్‌ఫ్రమ్ హోం క్రమంగా తగ్గుతూ ఉండటంతో ఆఫీసుకు వచ్చే ఐటీ ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రైళ్లతో మూడు మార్గాల్లో నడుపుతున్నా, అవి రద్దీ సమయాల్లో ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో అదనపు కోచ్‌లు పెంచాలన్న డిమాండ్ బాగా పెరిగింది. మొత్తం మెట్రో రైళ్లు మూడు కోచ్‌లతో కూడినవి 57 వరకు ఉన్నాయి. ప్రతిరోజూ మూడు కారిడార్లలో అవసరాన్ని బట్టి ప్రతి 3 నిమిషాలకో మెట్రో రైలును ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు నడుపుతున్నారు. అయినా ఇవేమాత్రం సరిపోవడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

### సూచనలు పాటించని అధికారులు

మెట్రో రైళ్లలో రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఎల్అండ్‌టీ మెట్రో అధికారులకు అదనపు కోచ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని అనేకసార్లు సూచించారు. ప్రస్తుతం ఉన్న ఒక్కో మెట్రో రైలులో ఒకేసారి 1000-1200 మంది వరకు మాత్రమే ప్రయాణించే అవకాశం ఉంది. రద్దీ సమస్యను అధిగమించేందుకు ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.


చేవెళ్లలో చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న వైద్యారోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్‌రావు

# చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాబాద్, మార్చి 3 : గ్రామాల్లో ఐదేండ్ల లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం చేవెళ్ల నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జరుగుతున్న పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం దేశ భవిష్యత్తుకు భవితవ్యం, నేటి బాలలే రేపటి పౌరులుగా, నేటి ఆరోగ్యమే రేపటి సౌభాగ్యం అనే విధంగా ఆరోగ్యశాఖ చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నదన్నారు. 4, 5 తేదీల్లో కూడా తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్, సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, సంతోష్, వైద్యసిబ్బంది ఉన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మొయినాబాద్, మార్చి 3 : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 8 మందిని పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.47వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ శివారులో ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రం షెడ్డులో అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడతోపాటు నగరానికి చెందిన ఏ రవి, ఎస్ యాదగిరి, డి మహేందర్, జి రాజు, జి మధు, జి మహేందర్, ఎం అశోక్, నాగరాజు ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.47,500ల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


రెండు రోజుల కిందట సుందరీకరణ పనులను పరిశీలించిన కమిషనర్ రోనాల్డ్ రాస్

# బోసిపోతున్న చెరువులు

- సుందరీకరణ పట్టని బల్దియా
- కమిషనర్ ఆదేశించినా.. పురోగతిలో లేని పనులు

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): చెరువులను కాపాడి పరిసరాలను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాల్సిన జీహెచ్ఎంసీ సుందరీకరణ పనులను అటకెక్కిస్తోంది. చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్‌లు, ల్యాండ్ స్కేపింగ్ పనులు ముందుకు కదలడం లేదు. పైగా ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు భారీ వచ్చి చేరి.. చెరువులన్నీ కంపుకొడుతున్నాయి. చెరువు సుందరీకరణ పనులు నిలిచిపోవడం పట్ల బల్దియాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతగా 20 చెరువులను గత కేసీఆర్ ప్రభుత్వం సుందరీకరణ పనులను రూ.271.33 కోట్లతో చేపట్టింది. అయితే కొత్త ప్రభుత్వం వచ్చాక గడిచిన మూడు నెలలుగా చెరువుల సుందరీకరణ పనులు ఏ మాత్రం ముందుకు కదలడం లేదు. ఈ క్రమంలోనే శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ జోన్‌లలో పలు చెరువులను రెండు రోజుల కిందట అధికారులతో కలిసి కమిషనర్ రోనాల్డ్ రాస్ సుందరీకరణ పనులను పరిశీలించారు. ఫెన్సింగ్, చెరువు క్లీనింగ్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలు చెరువుల వద్ద మురుగు మళ్లింపు ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.